# అత్తా - కోడలు

శ్రీమతి శ్యామలాదేవి

"అత్తయ్యా" అంటూ జాలిగా, బాధగా పిలిచింది కోడలు మంచంమీద పడుకొని.

కోడలివైపు ప్రశ్నార్థకంగా చూచింది. అత్తగారు.

"అత్తయ్యా! మిమ్మల్ని క్షమార్పణం వేడుకుంటున్నా, క్షమించరూ!" అని ఆవేదనగా ప్రార్థించింది కోడలు.

అత్త ప్రేమగా కోడలి తల నిమిరింది. 'ఎందుకే పిచ్చి తల్లీ యింత బాధ' అనే భావం యిమిడి వుందా చూపులో.

"ఇంకా ప్రేమగా లాలిస్తున్నారత్తయ్యా? నేను అ మహా పాపిని. మీ హృదయాన్ని అర్థం చేసుకోలేని రాక్షసిని" అని తన్ను తాను నిందించుకున్నది కోడలు.

"ఇప్పటికైనా అర్థం చేసుకొన్నావుగా. ఇంకా నిన్ను నేను నిందించుకోడం ఎందుకు" అన్నట్లు తల వూపింది అత్త.

"నాకేదో యీ యింట్లో స్వతంత్రంలేదని, మీరు నా మీద అధికారం చెలాయిస్తున్నారని, నావలె కోడంటికం పడె స్త్రీ ఈ ప్రపంచంలో వుండదని భావించాను అత్తయ్యా" అంటూ వాపోయింది కోడలు.

"ఇన్నాళ్ళకైనా అర్థం చేసుకున్నావు. అంతే చాల్లే" అన్నట్లు తృప్తిగా చూసింది అత్త కోడలివైపు.

"మీరు చేసే ప్రతీపని, మాట్లాడే ప్రతీమాట తప్పుగా అర్థంచేసుకున్నాను. మీ అబ్బాయితోకూడా చాలాసార్లు చెప్పాను. నేనింక సహించలేను. మనిద్దరం వేరుగా వుందామని ఆయనతో చాలా పోరుపెట్టాను అత్తయ్యా" అంది కోడలు.

అత్త చాల భయంగా చూసింది కోడలివైపు. తన మీద కొడుక్కి ప్రేమ పోలేదుకదా అని.

"భయపడకండి అత్తయ్యా! మీ అబ్బాయికి మీరంటే ఎంతప్రేమ, గౌరవం, అనుకున్నారూ! నామాటలన్నీ విని, అమ్మను నీవు సరిగా అర్థం చేసుకోలేకపోతున్నావు. కాస్త శాంతంగా కూర్చుని, సహృదయంతో ఆలోచించు. అప్పుడు తెలుస్తుంది అమ్మకు నీమీద ఎంతప్రేమవుందో. అంతేకాని పిచ్చిమాటలు మాట్లాడకు అని మందలించారు." మూలుగుతూ చెప్పింది కోడలు.

సంతోషాన్ని పట్టలేకపోయింది అత్త. కోడలిని కావలించుకొని నిజమేనా! అన్నట్లు చూసింది.

"తొందరెందుకు అత్తయ్యా? సంగతి అంతా చెప్తాను. మీ అబ్బాయి అంత చెప్పినా మనస్సు మార్చుకోలేక పోయాను. ఇంకా నాలో ద్వేషం పెచ్చుపెరిగింది. ఈ యింట్లో అంతా నా పెత్తనమే వుండాల అనుకున్నా. రాక్షసులకంటే కూడా క్రూరంగా తయారయ్యాను" అంటూ బాధపడింది కోడలు.

కోడలిని తన వడిలోకి తీసుకొంది అత్త "అయ్యో! పిచ్చితల్లీ! అయిందేదో అయిపోయింది" అన్నట్లు.

"లేదత్తయ్యా నేను పిచ్చిదాన్నికాదు. తల్లీ కొడుకుల్ని వేరుచెయ్యాలనుకున్న పాతకిని. స్వార్థాన్ని చూసుకున్న పిశాచిని అత్తయ్యా! ఆయన మాటల్నికూడా లెక్కచెయ్యకుండా, అందర్నీ బాధపెట్టాలనుకున్నాను. మిమ్మల్ని హతమారుస్తేకాని మనశ్శాంతి వుండదనుకున్నా అందుకే మీకుచేసిన ఫలహారంలో విషం కలిపాను. మాతృహత్యకు పూనుకున్న మహాపాతకిని" అంటూ కన్నీరు కార్చింది కోడలు.

"నా యీ సాహసానికి ఆశ్చర్యపోతున్నారా అత్తయ్యా? యింకా.........అబ్బా.........చాలా పాపం చేశాను. ...ఇరుగు పొరుగులతో మీ శీలం మంచిది కాదని చెప్పాను. దానికి ఫలితం వాళ్ళచేత చివాట్లు తిన్నాను" బావురుమంది కోడలు.

అనుమానంగా భయంగా చూసింది అత్త కోడలిని. మనోవ్యాధా. మరేమైనా తెచ్చిపెట్టుకున్న జబ్బా అని. తనను యింత అపనింద పాలుచేసిందే అనే కోపంకూడా కనపడుతున్నదా చూపుల్లో.

"కోపగించుకోవద్దు అత్తయ్యా! యింకా నరకంలో పడిపోతాను .. ఆఖరి ...దశ....మీ ప్రేమ....దృక్కులు ప్రసారించండి ...అంతే....చాలు.... అబ్బా....అందరిలో మంచి... పేరు .... తెచ్చుకున్నారు.... నేనో కళంకాన్నంతా తెచ్చిపెట్టుకున్నాను....ఇప్పటికి....అర్థం చేసుకున్నా.... యింక....గౌరవం .... పొందలేను.... మీకు పెట్టాలనుకున్న విషం ... నాకే....పెట్టుకున్నాను.... నన్ను బ్రతికించకండి....ఈ పాపిష్టి ముఖాన్ని....ఎవరికీ చూపించలేను....ఒక్కసారి క్షమించాను....అనండి....అంతేచాలు అంతే....అత్తయ్యా....క్షమించరూ? .... ఇంక శలవు" అంటూ చేతులెత్తి నమస్కరించి అత్త కాళ్ళమీద పడ్డది.

అత్త ఆమెను తన ఒడిలోకి తీసుకుంది.